సాక్షి
పశ్చిమగోదావరి

ఆదివారం : 1 : సెప్టెంబర్ : 2024



ఆక్వా విలవిల
ఎడతెగని వర్షాలతో ఆక్వా రైతులు ఆందోళన చెందుతున్నారు. వాతావరణంలో ఉష్ణోగ్రతలు తగ్గడం రొయ్యలు, చేపల సాగుపై ప్రభావం చూపుతుందంటున్నారు. 8లో ▸



లెక్క తేల్చనున్న పశుగణన
ఉమ్మడి జిల్లాలో పశు సంతతి నానాటికీ తగ్గిపోతుంది. పశుపోషణ భారంగా మారడం, దాణా ధర పెరగడం, కూలీలు దొరక్కపోవడంతో రైతులు ఆసక్తి చూపడటం లేదు. 8లో ▸



కందిపప్పు లేనట్టే!
ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా కందిపప్పు సరఫరాపై రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఈ నెలలోనూ చేతులెత్తేసింది. బియ్యం, పంచదారతో సరిపెట్టనుంది. 8లో ▸

వదలని వర్షం

భీమవరం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ నంబర్ 08816-299219

స్తంభించిన జనజీవనం
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- నీట మునుగుతున్న పంట పొలాలు
- పొంగి ప్రవహిస్తున్న కాలువలు, డ్రెయిన్లు
- జిల్లాలో 192.3 సెం.మీ వర్షపాతం
- కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూం ఏర్పాటు



భీమవరం.. జలమయం.. భీమవరం ఇండస్ట్రియల్ ఏరియాలో నీటమునిగిన రోడ్డు

సాక్షి, భీమవరం: బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావంతో రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలు జనజీవనాన్ని స్తంభింపజేశాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పంట కాలువలు, డ్రెయిన్లు పొంగి ప్రవహిస్తున్నాయి. శనివారం జిల్లావ్యాప్తంగా 192.3 సెం.మీ వర్షపాతం నమోదైంది. పాలకొల్లులో అత్యధికంగా 19 సెం.మీ వర్షపాతం నమోదైంది. ప్రజలకు సహాయ సహకారాలు అందించేందుకు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటుచేశారు.

ఏకాధాటిగా వాన..

శుక్రవారం వేకువజాము మొదలైన వర్షం ఏకధాటిగా పడుతూనే ఉంది. పాలకొల్లు, నరసాపురం, ఉండి, భీమవరం నియోజకవర్గాల్లో భారీగా, తాడేపల్లిగూడెం, తణుకు నియోజకవర్గాల్లో మోస్తరుగా వర్షం కురిసింది. రోడ్లు జలమయమయ్యాయి. పల్లపు ప్రాంతాలు నీట మునుగుతున్నాయి. అధిక శాతం మంది ఇళ్లకే పరిమితం కాగా విద్యాసంస్థలు, ఆఫీసులు, షాపులకు వెళ్లేవారు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. జనం లేక మార్కెట్లు వెలవెలబోయాయి.

- భీమవరంలోని హౌసింగ్ బోర్డుకాలనీ, ఇండస్ట్రీయల్ ఏరియా, బ్యాంక్ కాలనీ, మెంటేవారి తోట తదితర ప్రాంతాల్లో వీధులు జలమయమయ్యాయి. పట్టణంలోని ప్రధాన డ్రెయిన్లు రోడ్లను తాకుతూ ప్రవహిస్తున్నాయి. ఖాళీ స్థలాలు, స్కూల్ గ్రౌండ్‌లు నీట మునిగాయి.
- పాలకొల్లు పట్టణంలోని 16వ వార్డు, పెద్దపేటల్లో మోకాలు లోతు నీరు చేరింది. హౌసింగ్ బోర్డు కాలనీ, బంగారువారి చెరువుగట్టు, లజపతిరాయ్ పేట, బెత్లహంపేట, బ్రాడీపేట, ఓల్డ్ బ్యాంక్ కాలనీ ప్రాంతాలు నీట మునిగాయి.
- తణుకు పైడిపర్రు ప్రాంతంలోని డ్రైవర్స్ కాలనీలో డ్రెయిన్లు లాగక మురుగునీరు రోడ్లపైకి చేరడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి ఇబ్బంది పడుతున్నారు.
- ఆకివీడులో జాతీయ రహదారి నీట మునిగింది. సంతపేట, సాలిపేట, జవహర్ నగర్, పెదపేట తదితర ప్రాంతాల్లో ఇళ్లల్లోకి నీరు చేరింది.
- నరసాపురంలోని పొన్నపల్లి, 29వ వార్డు, శ్రీహరిపేట, రాయపేటలో రోడ్లు నీట మునిగాయి.

అధికారులు అప్రమత్తం

భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టర్ చదలవాడ నాగరాణి జిల్లా అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అవసరమైన చర్యలు చేపట్టేందుకు అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. మరో రెండు రోజులు పాటు భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణశాఖ హెచ్చరికలు నేపథ్యంలో అధికారులు అందరూ అందుబాటులో ఉండాలని ఆదేశించారు. నీటి పారుదలశాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని, బలహీనంగా ఉన్న కాలువ, డ్రెయిన్, చెరువుగట్లను పరిశీలించి పటిష్టం చేయాలన్నారు. లోతట్టు ప్రాంతాలు, శిథిలావస్థలో ఉన్న భవనాలు, గుడిసెలు, షెడ్స్‌లలో నివసిస్తున్న ప్రజలు తక్షణమే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. ఆపదలో ఉన్న వారికి తక్షణ సహాయక చర్యలు చేపట్టేందుకు వీలుగా 08816-299219 ఫోన్ నంబర్‌తో కంట్రోల్ విభాగాన్ని ఏర్పాటుచేశారు. ప్రజలు ఎవరైనా వర్షాల వలన ఇబ్బందులు పడుతుంటే వెంటనే ఈ నంబర్‌కు సంప్రదించాలని కోరారు. నందమూరు అక్విడెక్ట్, ఎర్రకాలువ, యనమదుర్రు డ్రెయిన్ సమీప ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని ఆమె సూచించారు. ఎక్కడైనా చెట్లు, విద్యుత్ స్తంభాలు పడిపోతే వెంటనే పునరుద్ధరించాలన్నారు.

పాలకొల్లులో 199.4 మి.మీ వర్షం

భీమవరం: జిల్లాలో రెండు రోజులుగా ఎడతెరపిలేని వర్షం కురుస్తోంది. జిల్లాలో శనివారం ఉదయం 1,923 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదుకాగా పాలకొల్లులో అత్యధికంగా 199.4 మిల్లీమీటర్ల వర్షం పడింది. మండలాల వారీగా నరసాపురంలో 131.4, పెనుమంట్రలో 110.4, భీమవరంలో 105.6, యలమంచిలిలో 102.2 వీరవాసరంలో 100.4, తాడేపల్లిగూడెంలో 73.2, పెంటపాడులో 63.8. తణుకులో 60.4, అత్తిలిలో 89.4 మి.మీ వర్షపాతం నమోదైంది. గణపవరంలో 74.4, ఆకివీడులో 79.2, ఉండిలో 98.6, పాలకోడేరులో 90.4, ఇరగవరంలో 85.4, పెనుగొండలో 89.2, ఆచంటలో 95.2, పోడూరులో 98.8, కాళ్లలో 91.2, మొగల్తూరులో 84.4 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

ముంపులో చేలు.. రైతుల బెంబేలు

భారీ వర్షంతో పల్లపు ప్రాంతాల్లోని పొలాలు నీటమునిగాయి. జిల్లాలోని 2.3 లక్షల ఎకరాల్లో తొలకరి సాగు జరుగుతోంది. ప్రస్తుతం పంట దుబ్బు చేసే దశ నుంచి చిరుపొట్ట దశల్లో ఉంది. ప్రస్తుత వర్షాలతో పల్లపు ప్రాంతాల్లోని పొలాలు నీట మునుగుతున్నాయి. నెలరోజుల క్రితం కురిసిన భారీ వర్షాలతో ఇప్పటికే ఒకసారి నాట్లు నష్టపోయిన రైతులు మరోసారి భారీ వర్షాలు బెంబేలెత్తిస్తున్నాయి. పొలాల్లోని ముంపు నీరు బయటకు పోయేందుకు రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

వర్షాలతో పలు రైళ్ల రద్దు

ఏలూరు (టూటౌన్): వర్షాల కారణంగా దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ పరిధిలో పలు రైళ్లను రద్దు చేసినట్లు పీఆర్‌ఓ సుబ్రత్ ఎం. మంద్రుపకర్ శనివారం ప్రకటనలో తెలిపారు. విజయవాడ డివిజన్ పరిధిలో మొత్తం 20 రైళ్లను ఆగస్టు 31, సెప్టెంబర్ 1 తేదీల్లో రద్దు చేసినట్లు తెలిపారు. దీనిలో భాగంగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో నడిచే విజయవాడ-కాకినాడ (17257), నిడదవోలు-భీమవరం (07886), భీమవరం-నిడదవోలు (07885), విజయవాడ-నరసాపురం (17261) రైళ్లను రద్దు చేశారు.



పాలకొల్లు 16వ వార్డులో మోకాలు లోతులో..



మొగల్తూరు మండలం కాళిపట్నంలో జాతీయ రహదారిపై వర్షం నీరు



తణుకు రాష్ట్రపతి రోడ్డులో వర్షం నీరు



ఆకివీడు సంతపేటలో రోడ్డు ఇలా..

న్యూస్‌రీల్

పింఛన్ల పంపిణీలో కలెక్టర్



పెదఅమిరంలో పింఛన్ అందిస్తున్న కలెక్టర్

కాళ్ల: పేదలకు ఇబ్బంది కలగకూడదన్న ఉద్దేశంతో ఒక రోజు ముందే పింఛన్లను పంపిణీ చేస్తున్నట్టు కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. మండలంలోని పెదఅమిరంలోని ఎస్సీ కాలనీలో శనివారం ఆమె ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. ఏడుగురు లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్లు అందించారు. సెప్టెంబరు 1వ తేదీ ఆదివారం సెలవు కావడంతో ముందే పింఛన్లు పంపిణీ చేశామన్నారు. డీఆర్‌డీఏ పీడీ ఎంఎస్ఎస్ వేణుగోపాల్, ఏపీఓ టి.మురళీకృష్ణ, ఎంపీడీఓ జి.స్వాతి, ఆర్ఐ జి.లక్ష్మి కిరణ్, సర్పంచ్ సోమేశ్వరరావు పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలు మేలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం(ప్రకాశం చౌక్): వినాయక చవితికి అందరూ మట్టి విగ్రహాలను పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుకుందాం అని కలెక్టర్ సి.నాగరాణి అన్నారు. శ్రీవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మట్టి విగ్రహాలపై ప్రచార భేరీ కార్యక్రమాన్ని శనివారం ఆమె పోస్టర్లు ఆవిష్కరించి ప్రారంభించారు. పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా మట్టి ప్రతిమలను పూజించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ప్రచార భేరీ కమిటీ సభ్యులు చెరుకువాడ రంగసాయి, కంతేటి వెంకట్రాజు, గోపిశెట్టి మురళీ, జడ్డు ప్రసాద్ పాల్గొన్నారు.

అగ్నిమాపక ఉద్యోగుల సంఘంలో స్థానం



పీవీ సత్యనారాయణ



గణేష్ సప్తగిరి

భీమవరం: రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల శాఖ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కమిటీ కోశాధికారిగా జిల్లాకు చెందిన ఫైర్‌మెన్ పీవీ సత్యనారాయణ (భీమవరం), స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా ఫైర్‌మెన్ ఎం.గణేష్ సప్తగిరి (నిడదవోలు) ఎన్నికయ్యారు. గతనెల 28న గుంటూరులో జరిగిన ఎన్నికల్లో సంఘ రాష్ట్ర అధ్యక్షుడిగా కె.చంద్రశేఖర్ (నెల్లూరు), ప్రధాన కార్యదర్శిగా పి.బాలకృష్ణ (విశాఖ) ఎన్నికయ్యారని సత్యనారాయణ శనివారం భీమవరంలో విలేకరులకు తెలిపారు.

హెచ్ఐవీపై అవగాహన అవసరం

భీమవరం (ప్రకాశంచౌక్): హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధిపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని డీఎంహెచ్ఓ మహేశ్వరరావు అన్నారు. జిల్లాలో అవగాహన కార్యక్రమాల్లో (మీకు తెలుసా) భాగంగా శనివారం భీమవరం ప్రాంతీయ ఆస్పత్రి నుంచి ప్రకాశం చౌక్ వరకు మారథాన్ రన్ నిర్వహించారు. జిల్లా అదనపు డీఎంహెచ్ డాక్టర్ బి.భానూనాయక్, దిశా సీపీఎం మధుసూదనరావు మాట్లాడుతూ మారథాన్ రన్‌లో విజేతలకు బహుమతులు అందిస్తామని, విజేతలు ఈనెల 3న విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

పారిశుద్ధ్య పరిస్థితులపై నివేదికలకు ఆదేశం

సాక్షి స్పందన

ద్వారకాతిరుమల: చిన వెంకన్న దేవస్థానంలో పారిశుద్ధ్య కాంట్రాక్టు గడువు పొడిగింపునకు చేస్తున్న యత్నాలు, అధ్వానంగా ఉన్న పారిశుద్ధ్యంపై 'సాక్షి'లో ప్రచురితమైన కథనాలపై కలెక్టర్ వెట్రి సెల్వి స్పందించారు. ఆయా అంశాలపై వెంటనే నివేదిక ఇవ్వాలని ఆలయ అధికారులను ఆదేశించారు. క్షేత్రంలో పారిశుద్ధ్య పనుల కాంట్రాక్టు వ్యవహారంపై ఈనెల 29న 'పారిశుద్ధ్య కాంట్రాక్టులో తిరకాసు', అలాగే పారిశుద్ధ్యం క్షీణించడంపై 30న 'శ్రీవారి కొండపై పారిశుద్ధ్యం అధ్వానం' శీర్షికలతో కథనాలు ప్రచురితమయ్యాయి. కలెక్టర్ ఆదేశాలతో అధికారులు తర్జనభర్జనలు పడుతున్నారు.

ఇన్‌చార్జి డీఐజీగా నాగలక్ష్మి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖ ఏలూరు రేంజ్ ఇన్‌చార్జి డీఐజీగా కాకినాడ డీఐజీ ఎ.నాగలక్ష్మి నియమితులయ్యారు. ప్రస్తుతం ఏలూరు రేంజ్ డీఐజీగా పని చేస్తున్న కె.అబ్రహం శనివారం పదవీ విరమణ చేశారు. దీంతో నాగలక్ష్మిని ఇన్‌చార్జిగా నియమించారు.

రుచి, శుచిలో మేటి.. శ్రీవారి ప్రసాదాలు

ప్రసాదం.. మధురం
- చిన వెంకన్న క్షేత్రంలో పక్కాగా ప్రసాదాల తయారీ
- రవాణాలోనూ పెరిగిన జాగ్రత్తలు
- తరచూ ఆలయ అధికారుల తనిఖీలు
- హర్షం వ్యక్తం చేస్తున్న భక్తులు



ద్వారకాతిరుమలలోని అంబరుఖానాలో పులిహోర ప్రసాదాన్ని ప్యాక్ చేస్తున్న సిబ్బంది

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న భక్తులకు అత్యంత ప్రీతికరమైనవి ప్రసాదాలు. క్షేత్రానికి వచ్చే భక్తులు వీటిని మహా ప్రసాదంగా స్వీకరిస్తారు. అయితే కొద్దిరోజుల క్రితం సోషల్ మీడియాలో శ్రీవారి పులిహోర ప్రసాదంలో పురుగు వచ్చిందంటూ కొందరు పెట్టిన పోస్టులు వైరల్ అయ్యాయి. ఇవి శ్రీవారి భక్తులను కలచివేశాయి. ఈ నేపథ్యంలో ఆలయ అధికారులు అంబరుఖానా (ప్రసాదాల తయారీ కేంద్రం)లో పరిశుభ్రతకు మరింత ప్రాధాన్యమిచ్చారు. అలాగే కౌంటర్ల వద్దకు ప్రసాదాలను తరలించే విషయంలో పలు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

పలు రకాల ప్రసాదాలు : క్షేత్రంలో స్వామివారి లడ్డూ, పులిహోర, శర్కర పొంగలి, వడ ప్రసాదాలను దేవస్థానం విక్రయిస్తోంది. సాధారణ రోజుల్లో సుమారు 10 వేల లడ్డూలు, 6 వేల పులిహోర ప్యాకెట్లు, 2 వేల శర్కర పొంగలి పొట్లాలు, 500 వడలను, 300 పెద్ద లడ్డూలను భక్తులు కొనుగోలు చేస్తారు. శని, ఆదివారాలు, ఇతర పర్వదినాల్లో రోజుకి 40 వేల లడ్డూలు, 10 వేల పులిహోర ప్యాకెట్లు, 5 వేల శర్కర పొంగలి ప్యాకెట్లు, 600 పెద్ద లడ్డూలు, 1,000కి పైగా వడ ప్రసాదాలను దేవస్థానం విక్రయిస్తోంది. గతంలో కంటే ప్రసాదాల నాణ్యత, రుచి బాగా పెరిగిందని భక్తులు అంటున్నారు.



శర్కర పొంగలి ప్రసాదాన్ని పొట్లాలు కడుతూ..



గూడు కట్టిన ఆటోలో ప్రసాదాలను తరలిస్తూ..

పొరపాట్లకు తావులేకుండా..

సోషల్ మీడియాలో 'పురుగు' పోస్టు పలు అనుమానాలకు తావిస్తోంది. అంబరుఖానాలో పులిహోర ప్రసాదాన్ని అత్యంత కట్టుదిట్టంగా, జాగ్రత్తగా తయారు చేస్తారు. 30 మంది సిబ్బంది శిరస్సులకు కవర్ క్యాప్‌లు, చేతికి గ్లౌజులు, మాస్కులు ధరించి ప్రసాదాన్ని ప్యాక్ చేస్తారు. ఈ క్రమంలో పులిహోర ప్రసాదంలో పురుగు చేరే అవకాశం లేదని తెలుస్తోంది.

పెరిగిన తనిఖీలు.. జాగ్రత్తలు

తయారైన ప్రసాదాలను సంబంధిత కాంట్రాక్టర్ ట్రక్కు ఆటో ద్వారా కౌంటర్లకు రవాణా చేసే సమయంలో చెట్లపై ఉన్న పురుగు ప్రసాదంలో పడి ఉండొచ్చని భావించిన అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టారు. ఆటో ట్రక్కుకి టార్పాలిన్‌తో గూడు ఏర్పాటు చేసి ప్రసాదాలను కౌంటర్లకు తరలిస్తున్నారు. అంబరుఖానాలో పరిశుభ్రతపై తరచూ తనిఖీలు చేస్తున్నారు. అలాగే ప్రసాదాల విక్రయాల కౌంటర్లను పరిశీలిస్తున్నారు. ప్రసాదంలో లోపాలు ఉంటే భక్తులు నేరుగా ఆలయ కార్యాలయంలో ఫిర్యాదులు చేయాలని ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు కోరారు.

ప్రసాదాలు చాలా బాగున్నాయి



శ్రీవారిని ఉదయం కుటుంబ సమేతంగా దర్శించుకున్నాం. ఆ తరువాత ఉచిత అన్నప్రసాదాన్ని స్వీకరించి, అక్కడున్న కౌంటర్‌లో లడ్డూ, పులిహోర ప్రసాదాలను కొనుగోలు చేశాం. కొన్ని తినగా మిగిలిన ప్రసాదాలను ఇంటికి తీసుకెళ్తున్నాం. ప్రసాదాలు చాలా రుచిగా, శుభ్రంగా ఉన్నాయి.

– బాలిన వెంకటలక్ష్మి, చల్లచింతలపూడి, దెందులూరు మండలం

అధికారులు ఆరా తీశారు



స్వామివారి దర్శనం తర్వాత కౌంటర్‌కు వెళ్లి ప్రసాదాలను కొనుగోలు చేశాను. ఆ సమయంలో అక్కడికి వచ్చిన ఆలయ అధికారులు ప్రసాదాలు ఎలా ఉన్నాయని ఆరా తీశారు. అలాగే కౌంటర్‌లు శుభ్రంగా ఉన్నాయా లేవా అని పరిశీలించారు. అధికారుల పర్యవేక్షణపై భక్తులు హర్షం వ్యక్తం చేశాం.

– వెల్లవనేని కృష్ణ, విజయవాడ

నూజివీడు పెద్ద చెరువుకు గండ్లు



నూజివీడులో పెద్ద చెరువుకు గండి పడిన ప్రాంతం

నూజివీడు: భారీ వర్షాలతో నూజివీడు పట్టణాన్ని ఆనుకుని ఉన్న పెద్ద చెరువుకు శనివారం రెండు చోట్ల గండ్లు పడ్డాయి. కనకదుర్గమ్మ ఆలయం పక్కన, విస్సన్నపేట రోడ్డులో ఇక్లాస్ స్కూల్ సమీపంలో గండ్లు పండటంతో 30వ వార్డులో 100కు పైగా ఇళ్లు ముంపునకు గురయ్యాయి. 300 ఎకరాలకు పైగా వరి పైరు కొట్టుకుపోయింది. నూజివీడు-విస్సన్నపేట రహదారి, బైపాస్ రోడ్డుపై వరద నీరు ప్రవహిస్తోంది. దీంతో నూజివీడు-విస్సన్నపేట, హనుమాన్‌జంక్షన్-విస్సన్నపేట మార్గాల్లో రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే ఊటవాగు, రామిలేరు వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో నూజివీడు-ముసునూరు, నూజివీడు-ఏలూరు (వయా కొప్పాక, నూజివీడు-మడిచర్ల, మీర్జాపురం -గోపవరం మార్గాల్లో రాకపోకలు నిలిచిపోయాయి.

ఎస్పీ ప్రత్యేక పర్యవేక్షణ

ఏలూరు ఎస్పీ కొమ్మి శివప్రతాప్ కిషోర్ హుటాహుటిన నూజివీడు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. సీఐ ఎంవీవీఎస్ఎన్ మూర్తి తన సిబ్బందితో ముంపు బారిన పడిన రహదారులపై రాకపోకలను క్రమబద్ధీకరించారు. పట్టణంలోని బైపాస్ రోడ్డులో వాహనాల రాకపోకలను ఎస్పీ నియంత్రించారు. ముంపు బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఎస్ఆర్ఆర్ హైస్కూల్‌లో పునరావాస కేంద్రాన్ని ఏర్పాటుచేశారు.

సాయం అందదు.. సాగు సాగదు

నాట్లు.. పాట్లు
- జూలైలో వర్షాలు, వరదలతో 13 వేల ఎకరాల్లో నాట్లకు దెబ్బ
- 9,918 మంది రైతులకు నష్టం
- నేటికీ అందని ఇన్‌పుట్ సబ్సిడీ
- రాయితీ విత్తనాలతో సరి
- నాట్లు వేసేందుకు అవస్థలు



పాలకోడేరు మండలం మోగల్లులో వరి నారు సిద్ధంగా ఉన్నా, నాట్లు వేయని భూములు

భీమవరం: పశ్చిమగోదావరి జిల్లాలో జూలై నెలలో కురిసిన భారీ వర్షాలు, వరదలతో వేలాది ఎకరాల్లో సార్వా నాట్లు దెబ్బతిన్నాయి. ఆయా భూముల్లో మరలా నాట్లు వేసేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం దెబ్బతిన్న చేలకు సంబంధించి పంట నష్టపరిహారం ఇప్పటికీ మంజూరు చేయలేదు. దీనికితోడు పంట పెట్టుబడి సాయం కూడా అందించలేదు. దీంతో రైతులు సాగు కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది. జిల్లాలో 2.19 లక్షల ఎకరాల్లో సార్వా వరి సాగు చేయాల్సి ఉంది. జూలైలో కురిసిన వర్షాలతో 13 వేల ఎకరాలకు పైగా నాట్లు దెబ్బతిన్నాయి. రైతులకు సబ్సిడీపై విత్తనాలు, ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరు చేస్తామని కూటమి నేతలు ప్రకటించారు. అయితే ఇప్పటివరకు కేవలం విత్తనాలతోనే సరిపెట్టారు. వర్షాలతో ఎకరాకు రైతులు సుమారు రూ.18 వేల వరకు నష్టపోయారు.

అధికారులు నిర్ధారించినా..

జూలైలో వర్షాలకు ముందు జిల్లాలో సుమారు 70 వేల ఎకరాల్లో వరి నాట్లు వేయగా 13,242 ఎకరాల్లో నాట్లు పూర్తిగా దెబ్బతిన్నట్టు అధికారులు అంచనా వేశారు. సుమారు 9,918 మంది రైతులకు పరిహారం అందించాలని నిర్ధారించారు. ప్రభుత్వపరంగా హెక్టారుకు రూ.17,500 ఇన్‌పుట్ సబ్సిడీ రైతులకు అందించాల్సి ఉంది. ప్రభుత్వ సాయం అందితే తిరిగి నాట్లు వేసుకోవచ్చునని రైతులు ఎదురు చూస్తుండగా ఇప్పటికీ సాయం అందలేదు. పాలకోడేరు మండలంలో సుమారు 500 ఎకరాలకు పైగా నాట్లు వేయడానికి నారు సిద్ధం చేసుకున్న రైతులు చేతిలో సొమ్ములు లేక నాట్లు వేయని పరిస్థితి నెలకొంది. భీమవరం మండలంలో దాదాపు 2 వేల ఎకరాల్లో నాట్లు వేయడానికి రైతులు విముఖత చూపుతూ చేలను ఖాళీగా ఉంచారు. అత్తిలి, పెనుమంట్ర తదితర మండలాల్లో ఇప్పటికీ నాట్లు పూర్తికాలేదని రైతులు చెబుతున్నారు. గత జగన్ పాలనలో సాగు ప్రారంభానికి ముందే రైతు భరోసా సాయం అందించేవారని, విపత్తుల సమయాల్లో పంట నష్టపరిహారం త్వరితగతిన మంజూరు చేసేవారని రైతులు గుర్తుచేసుకుంటున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

డెంగీ మృతిపై వివరాల సేకరణ



డెంగీతో మృతి చెందిన బాలిక కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరిస్తున్న అధికారులు

అత్తిలి: ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుని, మురుగునీరు నిల్వలేకుండా చూసుకోవాలని అత్తిలి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కె.నాగరాజు చెప్పారు. డెంగీ జ్వరంతో గూనా నిత్యశ్రీపద్మ మృతిచెందిన సంఘటనపై శనివారం ఆయన వైద్యసిబ్బందితో కలిసి బాధిత కుటుంబ సభ్యులను కలుసుకుని వివరాలు తెలుసుకున్నారు. వైద్యాధికారి మాట్లాడుతూ ఇంటి పరిసరాలను పరిశీలించి దోమల పెరుగుదల, లార్వా ఉండడానికి అనువైన ప్రదేశాలను పరిశీలించి వాటి నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అనంతరం విద్యార్థిని చదివిన ఎంఎం స్కూల్‌ను సందర్శించి పరిసరాల శుభ్రత, విద్యార్థుల వ్యక్తిగత పరిశుభ్రతపై స్కూల్ యాజమాన్యంతో చర్చించారు. దోమ లార్వాను సేకరించి పరీక్షించారు. గ్రామంలో ఫీవర్ సర్వే జరుగుతోందని చెప్పారు. కార్యక్రమంలో ఏఎంఓ పి.శ్రీనివాసరావు, సబ్‌యూనిట్ అధికారి జి.వెంకటేశ్వరరావు, సీహెచ్‌ఓ పి.మురళి, పాల్గొన్నారు.

నవోదయకు దరఖాస్తుల ఆహ్వానం

భీమవరం: పెదవేగి జవహర్ నవోదయ విద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఆన్‌లైన్ పరీక్షలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ జి.నాగమణి తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరంలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులంతా అర్హులన్నారు. పరీక్షలో ఉత్తీర్ణులైనవారు 2025–26 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశం పొందుతారన్నారు.

గుడ్లవల్లేరు కళాశాల గుర్తింపు రద్దుచేయాలి



మద్దా చంద్రకళ, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి

పాలకొల్లు అర్బన్ : గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాల గుర్తింపును తక్షణం రద్దు చేసి విద్యార్థినులకు రక్షణ కల్పించాలని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి మద్దా చంద్రకళ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. కళాశాల వాష్ రూమ్‌లో కెమెరాలు పెట్టి వీడియోలు చిత్రీకరించడం సభ్య సమాజం తలదించుకునే సంఘటనగా భావించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్‌కి విద్యార్థినులు వారం రోజుల నుంచి ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకోలేదన్నారు. కళాశాల యాజమాన్యానికి టీడీపీ ప్రముఖులతో సంబంధాలున్నందు వల్ల కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని చంద్రకళ ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల పాలనలో అత్యాచారాలు, విద్యార్థినుల పట్ల లైంగిక వేధింపులు ఎక్కువయ్యాయని ఆమె విమర్శించారు. మహిళలకు రక్షణ కల్పించలేని అసమర్థ ప్రభుత్వాన్ని చంద్రబాబు నడుపుతున్నారని విమర్శించారు.

ఆక్వా విలవిల

- వాతావరణ మార్పుతో పడిపోయిన ఉష్ణోగ్రతలు
- ఆక్సిజన్ కొరతతో మృత్యువాత పడుతున్న చేపలు, రొయ్యలు
- మరో రెండు రోజుల వర్షాల హెచ్చరికలతో ఆందోళన



ఆక్సిజన్ లేమి కారణంగా చెరువుల్లో మృతి చెందిన చేపలు(ఫైల్)

కైకలూరు : బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ఆక్వా రైతులు ఆందోళన చెందుతున్నారు. శుక్రవారం రాత్రి నుంచి వర్షం కురుస్తుండడంతో ఉష్ణోగ్రతలు పడిపోయాయి. ఈ ప్రభావం రొయ్యలు, చేపల సాగుపై ఉంటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

25 డిగ్రీలకు పడిపోయిన ఉష్ణోగ్రత

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 2.80 లక్షల ఎకరాల విస్తీర్ణంలో చేపల, రొయ్యల సాగు చేస్తున్నారు. వనామీ రొయ్యలను ఎక్కువగా సాగు చేస్తున్నారు. ఉష్ణోగ్రతలు తగ్గడంతో వైరస్ వ్యాధులు సోకే ప్రమాదముంది. సాధారణంగా రొయ్యల సాగుకు 34 డిగ్రీల సెంటీగ్రేట్ ఉష్ణోగ్రత అవసరం. వాతావరణ మార్పుల వల్ల శనివారం పలు ప్రాంతాల్లో 25 డిగ్రీలకు ఉష్ణోగ్రత పడిపోయింది. ఈ పరిస్థితుల్లో రొయ్యలు ఒత్తిడికి గురవుతాయి. ఇప్పటికే రొయ్యల రైతులు రూ.లక్షల్లో పెట్టుబడులు పెట్టి సాగుచేస్తున్నారు. వాతావరణం ఇలాగే కొనసాగితే భారీ నష్టాలు తప్పవని ఆందోళన చెందుతున్నారు.

ఒక్కో వ్యాధి నివారణకు రూ.15 వేల వరకూ ఖర్చు

వాతావరణ మార్పుల వల్ల ఆక్వా రంగంలో వ్యాధులు విజృంభిస్తున్నాయి. ఒక్కో వ్యాధికి ఎకరానికి రూ.10 వేల నుంచి రూ.15 వేలు ఖర్చు చేయాల్సి వస్తోంది. చేపల సాగులో జిగురు, సన్న జలగ, శంఖు జలగ, తాటాకు తెగులు, రెడ్ తెగులు, పేను తెగులు ఎక్కువగా వ్యాపిస్తాయి. రొయ్యల సాగులో వీహెచ్‌పీ, వైట్ స్పాట్ కలవరపెడుతుంది. రాష్ట్ర ఆదాయంలో కీలకంగా మారిన ఆక్వారంగానికి ఇప్పటికీ సరైన సౌకర్యాలు కల్పించడం లేదని ఆక్వా రైతులు ఆందోళన చెందుతున్నారు.

దేశంలోనే ఆక్వా ఉత్పత్తుల్లో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉంది. రాష్ట్రంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఆక్వా ఎగుమతుల్లో మొదటి స్థానాన్ని దక్కించుకుంటుంది. ఇలాంటి రంగాన్ని ఏటా ఆక్సిజన్ లేమి పట్టి పీడిస్తోంది. ఈ సమస్య వల్ల చేపలు పిట్టల్లా రాలిపోతున్నాయి. జిల్లాల్లో ఏడాదికి రూ.90 కోట్ల నష్టం వస్తుందని అంచనా. ప్రస్తుత వర్షాలతో ఆక్సిజన్ సమస్య తలెత్తుతుందని రైతులు మదనపడుతున్నారు. ఆక్సిజన్ సమస్య లక్షణాలు, నివారణలను కైకలూరు మత్స్యశాఖ ల్యాబ్ ఏడీ బి.రాజ్‌కుమార్ వివరించారు.

ఆక్సిజన్ సమస్య లక్షణాలు

- చెరువుల్లో రోహు, కట్లా పెద్ద సైజు చేపలు అధికంగా మరణిస్తాయి.
- ప్రధానంగా మొప్ప వ్యాధి సోకిన చేపలు మరణం ఎక్కువగా ఉంటుంది.
- ఉదయం చేపలు ఉపరితలంపైకి వచ్చి గాలి పీల్చుకుంటాయి.
- నీరు పచ్చగా మారి పులిసిన వాసన వస్తోంది.
- అడుగభాగంలోని నత్తలు పైకి తేలుతాయి.

నివారణ మార్గాలు



- ఆక్సిజన్ సమస్య ఉత్పన్నమైతే మేతలు కట్టకూడదు.
- కాల్సియం హైడ్రాక్సన్ ఎకరానికి 2 కేజీలు చల్లాలి.
- లైమ్(సున్నం) ఎకరానికి 25 కేజీలు పిచికారీ చేయాలి.
- ప్లాంక్టిన్ ఉంటే సూపర్‌పాస్పేట్ ఎకరానికి 25 కేజీలు చల్లాలి
- చెరువులో చనిపోయిన చేపలను తొలగించాలి.
- ఆక్సిజన్ సమస్య నుంచి కోలుకున్న తర్వాత మేతలో మినరల్ మిక్చర్ కలిపి ప్రతి టన్ను మేతకు 10–15 కేజీల మినరల్ మిక్చర్ కలిపి చల్లాలి.
- చెరువులో ఏరియేటర్లను ఎక్కువగా తిప్పాలి.

శ్రీవారి క్షేత్రంపై తుఫాన్ ఎఫెక్ట్



శ్రీవారి దర్శనానంతరం తూర్పు రాజ గోపురం మీదుగా బయటకు వస్తున్న భక్తులు

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంపై తుఫాన్ శనివారం తీవ్ర ప్రభావాన్ని చూపింది. స్వామికి ప్రీతికరమైన రోజు కావడంతో ప్రతి వారం వేలాది మంది భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించేవారు. ఈ వారం వర్షం కారణంగా ఆలయానికి స్వల్ప సంఖ్యలో భక్తులు విచ్చేశారు. దాంతో ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతం, అనివేటి మండపం, దర్శనం క్యూలైన్లు, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, కేశఖండనశాల ఇతర విభాగాల్లో భక్తుల రద్దీ కనిపించలేదు.

సంచార జాతుల సమస్యలు పరిష్కరించాలి



భీమవరంలో మాట్లాడుతున్న పెంద్ర వీరన్న

భీమవరం(ప్రకాశం చౌక్): సంచార జాతుల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని సంచార జాతుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ పెంద్ర వీరన్న కోరారు. ఆగస్టు 31 సంచారజాతుల దినోత్సవాన్ని భీమవరం అంబేడ్కర్ భవనంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న పెంద్ర వీరన్న మాట్లాడుతూ బ్రిటిష్ పాలకుల సమయంలో అట్టడుగు స్థాయిలో జీవించే సంచారజాతుల కులస్తులను నేరస్తులుగా చిత్రీకరించి వారితో వెట్టి చాకిరి చేయించుకునేవారన్నారు. స్వాతంత్య్రం అనంతరం సంచార జాతుల అభివృద్ధికి అనంత శయనం అయ్యంగార్ కమిషన్ ప్రభుత్వానికి నివేదిక ఇచ్చిందన్నారు. 1952 ఆగస్టు 31న కమిషన్ సిఫార్సు మేరకు నేరస్తుల కులాలుగా ఉన్న వారిని సంచార జాతుల కులాలు ప్రభుత్వం గుర్తించి ప్రకటించడంతో ఏటా ఆగస్టు 31న సంచార జాతుల స్వతంత్ర దినోత్సవంగా నిర్వహిస్తారన్నారు. 2008 బాలకృష్ణ రేణుక జాతీయ కమిషన్ చైర్మన్‌గా ఇచ్చిన నివేదిక ప్రకారం 10 శాంత రిజర్వేషన్ సంచార జాతులకు కేటాయించాలన్నారు. సంచార జాతులకు ఎటువంటి ఆస్తులు లేని కారణంగా జీవనభృతిని కల్పించాలని డిమాండ్ చేశారు. విద్య, ఉపాధి, రాజకీయ రంగాల్లో ప్రత్యేక అవకాశాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సంచార జాతుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు అనపరెడ్డి శేఖర్, సంచార జాతుల సంఘం రాష్ట్ర గౌరవ సలహాదారుడు గంట వెంకన్నబాబు, ప్రోగ్రాం కమిటీ కన్వీనర్ సాల అశోక్ కుమార్, జిల్లా అధ్యక్షుడు చుండూరి మునలయ్య తదితరులు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- వర్షాలు తగ్గే వరకూ సెలవులు రద్దు
- డీపీఓ శ్రీనివాస విశ్వనాథ్

ఏలూరు(మెట్రో): జిల్లాలో భారీ వర్షాల కారణంగా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా గ్రామ పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ సూచించారు. శనివారం ద్వారకా తిరుమల పంచాయతీ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామ పంచాయతీ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉన్నారా? లేదా? అన్న విషయంపై ఆరా తీశారు. విస్తరణ అధికారి ఏ.వి.సుబ్బరాయన్‌తో కలిసి డ్రైనేజీలు, తాగునీరు బోర్లు, పారిశుధ్యం నిర్వహణ పరిశీలించారు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ పంచాయతీ రాజ్ శాఖ డైరెక్టర్ కృష్ణతేజ, కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశాల మేరకు స్వచ్ఛమైన తాగునీరు ప్రజలకు అందించాలని, పారిశుధ్య నిర్వహణ సక్రమంగా జరగాలని, లోతట్టు ప్రాంతాలలో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. ప్రజలు కూడా కాచి చల్లార్చిన నీరు తాగాలని, వృద్ధులు, పిల్లలు తోడులేకుండా బయటకు రావద్దని సూచించారు. జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసిందని అన్నారు. వర్షాలు తగ్గేంత వరకు సిబ్బందికి సెలవులు లేవని డీపీఓ తెలిపారు.

రైల్వే హెల్ప్‌లైన్ ఏర్పాటు

ఏలూరు (టూటౌన్) : భారీ వర్షాల కారణంగా ప్రయాణికులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా విజయవాడ డివిజన్ పరిధిలోని భారీ వర్షాలు పడే ముఖ్యమైన కేంద్రాల్లో హెల్ప్‌లైన్లు కేటాయించినట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు శనివారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. భీమవరం టౌన్ రైల్వే స్టేషన్‌లో హెల్ప్ లైన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భీమవరం హెల్ప్ లైన్ నెంబర్ 78159 09402ను అవసరమైన వారు సంప్రదించాలని కోరారు.

ఈ నెలా కందిపప్పు లేనట్టే !

- బియ్యంతోనే సరి
- గోధుమ పిండి ఊసే లేదు



ఏలూరు (టూటౌన్): ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా కందిపప్పు సరఫరాపై రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ నెలలో కూడా చేతులెత్తేసింది. బియ్యంతోనే సరిపెట్టనుంది. ప్రభుత్వం అందిస్తున్న రేషన్‌లో ఏ సరుకు ఏ నెల అందుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. గత నెలలో కొన్ని ప్రాంతాల్లో బియ్యంతో పాటు అరకొరగా పంచదార, గోధుమ పిండి ఇచ్చారు. ఈ సారి అవి అందరికీ దక్కేలా లేవు. జిల్లాలకు సరుకు సరఫరా చేయకపోవడంతో ఉన్న నిల్వతోనే పంపిణీ చేయాలని అధికారులు నిర్ణయించారు. గత ప్రభుత్వ హయాంలో బియ్యం, పంచదారతో పాటు కందిపప్పు, గోధుమ పిండి అందజేసేవారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రతి కార్డుదారుడికి కందిపప్పు అందించేలా చర్యలు తీసుకున్నారు.

గొప్పలు చెప్పి చేతులెత్తేశారు

జూన్‌లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పౌర సరఫరాల శాఖపై నిర్వహించిన సమీక్ష సందర్భంగా రేషన్‌లో అన్ని సరుకులూ పంపిణీ చేయనున్నట్లు ప్రకటించినా కార్యాచరణకు నోచుకోలేదు. గత నెలలో కందిపప్పు అందుతుందని లబ్ధిదారులు ఆశించినా ఇవ్వలేదు. సెప్టెంబర్‌లో వినాయక చవితి సందర్భంగా ప్రభుత్వం కందిపప్పు ఇస్తుందని ఆశించినా కార్డుదారులకు ఈ నెల నిరాశే మిగిలింది.

జిల్లాలో 6,31,044 రేషన్ కార్డులు

జిల్లాలో మొత్తం 6,31,044 రేషన్ కార్డుదారులకు సెప్టెంబర్ నెల సరుకులను 395 ఎండీయూ వాహనాల ద్వారా సరఫరా చేసేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంది. వీరందరికీ పూర్తి స్థాయిలో బియ్యం మాత్రమే అందనున్నాయి. జిల్లాలో ఉన్న నిల్వల మేరకు పంచదార పంపిణీ జరుగనుంది. గతంలో అందించిన కందిపప్పు, రాగులు, గోధుమ పిండి వంటి సరుకుల ఊసే లేదు. బియ్యం మినహా ఇతర అన్ని సరుకులనూ గత ప్రభుత్వం ఎంపిక చేసిన సంస్థలు, కంపెనీలే సరఫరా చేస్తున్నాయి. ప్రభుత్వం వాటి స్థానంలో కొత్త వాటిని ఎంపిక చేసి వాటి ద్వారా పంపిణీ చేయాలని భావిస్తున్నట్లు సమాచారం.

రాయితీ డబ్బులు ఇవ్వని కేంద్రం!

కందిపప్పుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం రాయితీ డబ్బులు ఇవ్వలేదని తెలుస్తుంది. పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ గత నెలలో కేంద్ర ప్రభుత్వ పెద్దలను కలిసినా ప్రయోజనం లేకపోయింది. రాష్ట్ర ప్రభుత్వమే తన నిధులతో కందిపప్పును సేకరించేందుకు టెండర్లు పిలిచినట్లు సమాచారం. అవి ఖరారు కాకపోవడమే సెప్టెంబర్‌లో కందిపప్పు పంపిణీ కాకపోవడానికి ప్రధాన కారణమనే చర్చ నడుస్తోంది.

రైతు బజార్లలో నాసిరకం కందిపప్పు

నిత్యావసర వస్తువుల ధరలను తగ్గిస్తున్నామనే పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా రైతు బజార్ల ద్వారా ప్రభుత్వం కందిపప్పు పంపిణీ చేపట్టింది. అది నాసిరకంగా ఉండడంతో వినియోగదారులు కొనుగోలు చేసేందుకు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. బహిరంగ మార్కెట్లో ఉన్న ధరపై రూ.10 నుంచి రూ.20 వరకు కిలోపై ధర తగ్గిస్తున్నా అది రెండో రకం కందిపప్పు కావడంతో తీసుకునేందుకు ఎవరూ ఇష్టపడడం లేదు. మరో వైపు ప్రజా పంపిణీ వ్యవస్థ(పీడీఎస్) ద్వారా పంపిణీ నిలిచిపోవడంతో కందిపప్పు ధరలు క్రమేణా పెరుగుతున్నాయి. ఎండీయూ వాహనాల ద్వారా గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాయితీపై కిలో రూ.67కే కందిపప్పు అందించేది. ఇప్పుడు పంపిణీ చేయకపోవడంతో మార్కెట్లో కందిపప్పు ధర క్రమంగా పెరుగుతూ ప్రస్తుతం కిలో రూ.180 నుంచి రూ.200కు చేరింది.

గుడ్లవల్లేరు ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలి

ఏలూరు (టూటౌన్): గుడ్లవల్లేరు శేషాద్రి ఇంజనీరింగ్ కళాశాలలో ఘటనపై సమగ్ర విచారణ చేయించి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పరక శ్యామల, మననవ యామిని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. బాలికలు, విద్యార్థినులు, యువతులపై అత్యాచారాలు, దాడులు పెరిగిపోతున్నాయని చివరికి విద్యాసంస్థల్లో కూడా రక్షణ లేకుండా పోయిందనేది గుడ్లవల్లేరు ఘటనతో నిర్ధారణ అయిందన్నారు. ఈ ఘటనలో కళాశాల యాజమాన్యం నిర్లక్ష్య వైఖరి తేటతెల్లం అయిందన్నారు. ఈ సంఘటన బయటకు రాకుండా యాజమాన్యం తొక్కి పెడుతుందని ఆరోపించారు. కళాశాల విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పూర్తి సంరక్షణ కల్పించాలని, దీనిపై రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘాతుకాలు చేయడానికి సాహసించకుండా ఉండేలా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. ఘటనకు బాధ్యులైన వారు ఎంతటి వారైనా వదలకూడదని కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

జంగారెడ్డిగూడెం: ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు హెచ్‌సీ భీమశేఖర్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు మండలంలోని తిరుమలాపురం బైనేరువాగు సమీపంలో తనిఖీలు నిర్వహించగా, ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసి, దొడ్డి వెంకట శ్రీనివాసరావుపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

లెక్కతేల్చనున్న పశుగణన

- 21 నుంచి సర్వే
- ఐదేళ్లకోసారి నిర్వహణ





తాడేపల్లిగూడెం : పశుసంతతి లెక్కలు, వాటికి వస్తున్న వ్యాధులు, నివారణకు కార్యాచరణ వంటి వాటిని తెలుసుకునేందుకు ఐదేళ్లకోసారి నిర్వహించే పశుగణన ఈ నెల 21 నుంచి ప్రారంభం కానుంది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఇంట్లో పాడి పశువులుంటే శుభం అని భావించేవారు. ఆర్థికంగా కూడా కుటుంబాలకు పాడి అండగా ఉండేది. అలాంటి జిల్లాలో పశుసంతతి నానాటికి తగ్గిపోతుంది. పశుపోషణ భారంగా మారడం, దాణా ధర పెరగడం, పశుపోషణకు కూలీలు దొరకకపోవడంతో రైతుల్లో పశుపోషణ పట్ల అనాసక్తి పెరిగింది. మరోవైపు సంకర జాతి వైపు అందరి దృష్టి మళ్లింది. శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ పర్యవేక్షణలో పశు వీర్య నిల్వ కేంద్రాలు రావడంతో సంకరీకరణ వేగం పుంజుకుంది. నాటు ఆవు, జెర్సీ ఆవు సంకరంతో హైబ్రిడ్ ఆవు, నాటు గేదె, ముర్రా గేదె సంకరంతో గ్రేడెడ్ ముర్రా సంతతి వృద్ధి చెందింది. దీంతో ఇప్పుడు సంకరం వైపు అందరూ మొగ్గు చూపుతున్నారు. ఐదేళ్లకు ఒకసారి నిర్వహించే జాతీయ పశుగణన సర్వే ద్వారా ఈ విషయాలు వెల్లడవుతాయి. ఈ ఏడాది సెప్టెంబర్ 21న జాతీయ పశుగణన ప్రారంభం కానుంది.

ఐదేళ్లకోసారి పశుగణన

ప్రతే ఐదేళ్లకు ఒకసారి గణన చేస్తారు. పశువుల్లో వస్తున్న వ్యాధులను గుర్తించడం, వాటి నివారణ చర్యలకు కార్యాచరణ కోసం గణన చేస్తారు. సంతతి అభివృద్ధికి బడ్జెట్‌ను ప్రతిపాదించవచ్చు. పశువుల ఆధారంగా తయారవుతున్న ఉత్పత్తులు అంచనా వేయవచ్చు. జన్యుపరంగా అభివృద్ధి చేయాల్సిన జాతుల గురించి అంచనాకు రావచ్చు. దేశ జనాభాకు అవసరమైన పశు ఆధారిత ఉత్పత్తులు పెంచవచ్చు. పశు సంతతి ఆధారిత ఉత్పత్తుల తయారీ పరిశ్రమలను స్థాపించి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడం కోసం పశుగణన చేయాలి.

పశు సంతతితో 24 శాతం జీడీపీ

పశు సంపద ఆధారిత ఉత్పత్తులకు ప్రపంచంలో గిరాకీ ఉంది. విదేశీ మారక ద్రవ్యం ఆర్జించడానికి ఇది ఒక మార్గం. జీడీపీలో పశు సంతతి వాటా 2014–15లో 24.32 శాతం ఉండగా, 2022–23 అది 34 శాతానికి చేరింది. దేశ జనాభాలో సుమారు 8.8 శాతం మందికి జీవనోపాధిగా పశుసంపద ఉంది.

ఉమ్మడి జిల్లాలో..

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో పశుసంపద పర్యవేక్షణ, వైద్య సాయం, ఇతర సదుపాయాల కల్పన కోసం నాలుగు డివిజన్లు ఉన్నాయి. ఏలూరు, భీమవరం, పెంటపాడు, నిడదవోలులో ఈ డివిజన్లు ఉన్నాయి. అలాగే తణుకులో స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యానిమల్ హెల్త్, పెంటపాడులో సెంట్రలైజ్డ్ సెమన్ కలెక్షన్ సెంటర్, గోపన్నపాలెంలో పిగ్ బ్రీడింగ్ సెంటర్, ఏలూరులో యానిమల్ డిసీజ్ డయోగ్నొస్టిక్ సెంటర్ ఉంది.

ఉమ్మడి పశ్చిమలో పశుసంతతి

రకం	18వ గణన	19వ గణన	20వ గణన
ఆవులు	1,97,638	1,84,641	1,36,549
గేదెలు	6,69,969	6,13,873	5,12,142
గొర్రెలు	4,51,721	4,39,216	5,26,836
మేకలు	2,04,623	1,86,936	1,98,810
కోళ్లు		1,33,43,817	1,03,47,494

నాటు ఆవులు – 58,180, నాటు గేదెలు – 1,64,323, సంకర ఆవులు – 23,783, గ్రేడెడ్ ముర్రా– 2,11,463 ఉన్నాయి

సంతతి వృద్ధికి కృషి చేస్తున్నాం



మేలైన పశు సంతతి అభివృద్ధికి గేదెల పరిశోధన స్థానం ద్వారా కృషి చేస్తున్నాం. జాతీయ పశుగణన వల్ల క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితులు తెలుస్తాయి. ముర్రా జాతిని వృద్ధి చేస్తున్నాం. అధిక పాల దిగుబడినిచ్చే గేదెల వీర్యం సేకరించి నిల్వ చేసి గేదెల్లో ప్రవేశపెట్టడం ద్వారా పాల దిగుబడి పెరుగుతుంది. జిల్లాలో పశుసంతతి పెంచేందుకు ప్రభుత్వ ప్రణాళికలకు అనుగుణంగా కార్యాచరణతో ముందుకు వెళ్తున్నాం.

– డాక్టర్ కె.ఆనందరావు, గేదెల పరిశోధన స్థానం, వెంకట్రామన్నగూడెం

తమ్మిలేరుకు మూడోసారి వరద



ప్రవహిస్తున్న తమ్మిలేరు

ఏలూరు రూరల్ : ఏలూరులో తమ్మిలేరు ఉధృతి శనివారం మరోసారి పెరిగింది. విస్తారంగా కురుస్తున్న వర్షాలకు ఎగువ నుంచి తమ్మిలేరులోకి వరద నీరు ప్రవహిస్తోంది. గత నెల రోజుల్లో తమ్మిలేరుకు వరద పోటెత్తడం ఇది మూడోసారి. ఇప్పటికే వందల క్యూసెక్కుల వరద నీరు తమ్మిలేరు నుంచి కొల్లేరులోకి చేరింది. తాజాగా పడమట లాకుల వద్ద 10 గేట్లు, తూర్పు లాకుల వద్ద 6 గేట్లు ఎత్తి వరద నీటిని కిందకి విడుదల చేశారు. వర్షాలు ఆదివారం సైతం కొనసాగితే తమ్మిలేరు ఉధృతి కొనసాగుతుంది. లాకుల వద్ద ప్రమాదాల నివారణకు అధికారులు రాకపోకల నిలుపుదల చేశారు.

క్లుప్తంగా

చట్టాలపై అవగాహన అవసరం



బాలికలకు ఆహార పదార్థాలను వడ్డిస్తున్న జిల్లా జడ్జి సికిందర్ భాషా

తాడేపల్లిగూడెం (టీటీసీ): పట్టణంలోని తాడేపల్లిగూడెం మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, 11వ అదనపు జిల్లా జడ్జి షేక్ సికిందర్ భాషా ఆధ్వర్యంలో శనివారం బాలికల, బాలురు సాంఘీక సంక్షేమ హాస్టల్స్‌ను ఆకస్మికంగా తనిఖీలు చేశారు. బాల బాలికలకు అందిస్తున్న ఆహార పదార్థాలు, హాస్టల్స్‌లో మౌలిక వసతులు తదితర అంశాలను పరిశీలించారు. తగిన సూచనలు చేశారు. ఈ సందర్భంగా బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించారు. భారత రాజ్యాంగం, వివిధ చట్టాలు తదితర అంశాలను బోధించారు. ఈ కార్యక్రమంలో ఫుడ్ సేఫ్టీ అధికారులు, హాస్టల్ వార్డెన్లు తదితరులు పాల్గొన్నారు.

'గూడెం'లో 73.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం పట్టణ, రూరల్ మండలంలో గడిచిన 24 గంటల్లో 73.2 మిల్లీ మీటర్ల వర్షాపాతం నమోదైందని తహసీల్దార్ ఎం.సునీల్‌కుమార్ శనివారం తెలిపారు. కాగా, పెంటపాడు మండలంలో 63.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందన్నారు.

వరాల వెంకన్నకు ప్రత్యేక పూజలు



విశేష అలంకరణలో వరాల వెంకటేశ్వరస్వామి

అత్తిలి: ఈడూరు గ్రామంలో వేంచేసియున్న వరాల వెంకటేశ్వరస్వామికి శనివారం విశేష పూజలు జరిపారు. వేకువ జామున స్వామి వారికి సుప్రభాత సేవ, తోమాలసేవ నిర్వహించారు. ఉదయం అర్చనలు చేసి, స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజాదికాలను నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. హాజరైన భక్తులకు అన్నదానం చేశారు.

విద్యార్థులు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి



శశిలో జరిగిన ఇంక్యుబేషన్ మీట్‌లో మాట్లాడుతున్న విద్యార్థిని

తాడేపల్లిగూడెం: విద్యార్థులు పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడానికి స్టార్టప్ కంపెనీలు దోహదపడతాయని స్థానిక శశి ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం జరిగిన స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ 2024 అవగాహన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మొహ్మద్ ఇస్మాయిల్ అన్నారు. వైస్ చైర్మన్ మేకా నరేంద్రకృష్ణ మాట్లాడుతూ ఇంక్యుబేషన్ సెంటర్‌లో ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చిన సంస్థల ప్రతినిధులకు ధన్యవాదాలు తెలియజేశారు. హ్యాకథాన్ ప్రాధాన్యతను పలువురు వివరించారు. గో గ్రీన్ టెక్నాలజీస్, క్యారీషేర్, తేజస్ ఓపెన్ లాజిస్టిక్స్, స్వస్థ ఆర్గానిక్స్, న్యూట్రి రివైవ్, డ్రోన్ ఫ్యూజన్, కామ్యాస్ బ్యూటీ వెల్నెస్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. శశి ఇంక్యుబేషన్ సెల్ హెడ్.యం,.పవన్ కుమార్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టవిరుద్ధం

పాలకొల్లు అర్బన్: బాల్య వివాహాలు చట్ట విరుద్ధమని వాటిని ఎవరూ ప్రోత్సహించకూడదని సర్పంచ్ జమ్ము బేబీ మహాలక్ష్మి అన్నారు. పోడూరు మండలం జిన్నూరు గ్రామ సచివాలయంలో శనివారం బాల్య వివాహాల నిరోధ చట్టంపై నిర్వహించిన సమావేశంలో సర్పంచ్ బేబీమహాలక్ష్మి అధ్యక్షత వహించి మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శి పుచ్చకాయల రవి మాట్లాడుతూ బాల్య వివాహాలను నిరోధించడానికి గ్రామంలో 11 మంది సభ్యులతో కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. బాల్య వివాహం చేసుకున్న వరుడికి రెండు సంవత్సరాల జైలు శిక్ష, లక్ష రూపాయల జరిమానా విధిస్తారన్నారు. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వీఆర్వో చొప్పల బుజ్జి, స్కూల్ టీచర్ పూడి మెర్సి కమల సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ హక్కులు, చట్టాలను తెలుసుకోవాలి

ఉండి: ప్రతి ఒక్కరూ రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాలను తప్పక తెలుసుకోవాలని ఆర్ఐ కార్తీక్ అన్నారు. శనివారం మండలంలోని అర్తమూరు పెదపేట చర్చ్‌లో పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఇన్‌చార్జ్ వీఆర్వో ఎస్ చిన్నారావు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆర్ఐ మాట్లాడుతూ దేశంలో రాజ్యాంగం ప్రతి పౌరుడికీ హక్కు లను కల్పించారని అన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాలపైనా అవగాహన కలిగి ఉండాలన్నారు.

విస్తారంగా వర్షాలు

- వీడని ముసురు.. తప్పని తిప్పలు..
- ఎడతెరిపి లేకుండా వర్షం
- పల్లపు ప్రాంతాలు జలమయం

తణుకు: అల్పపీడనం ప్రభావంతో ముసురు ఇంకా వీడలేదు. గత మూడు రోజులుగా ఎడతెరిపి లేని వానతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని రోజులుగా వేసవి తరహాలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎండవేడిమి, ఉక్కబోతకు ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. అయితే గురువారం నుంచి కాస్త భిన్నమైన వాతావరణం కనిపిస్తోంది. గత మూడు రోజులుగా తణుకు నియోజకవర్గంలో ఎడతెరిపి లేని వర్షం కురుస్తోంది. వర్షం కారణంగా తణుకు పట్టణంలోని ప్రధాన రోడ్లు, డ్రెయినేజీలు పొంగి ప్రవహిస్తున్నాయి. రాష్ట్రపతి రోడ్డు, వెంకటేశ్వర థియేటర్ సెంటర్, డిగ్రీ కళాశాల సెంటర్, వాణిబ్యాంకు వీధి, బ్యాంకు కాలనీ, ఎన్జీవో కాలనీ, ఇరగవరం కాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీ తదితర ప్రాంతాల్లో రహదారులపైకి వర్షపు నీరు పొంగి ప్రవహిస్తోంది. లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోయింది. దీంతో జనజీవనం స్తంభించిపోయింది.



తణుకు: నీట మునిగిన వాణిబ్యాంకు వీధి

తెరిపివ్వని వర్షం

తణుకు టౌన్: గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా తణుకు రూరల్ ప్రాంతంలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాల కారణంగా తణుకు పైడిపర్రులోని డ్రైవర్ కాలనీలో మురుగునీరు జనావాసాల మధ్య నిలిచిపోవడంతో కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఎడతెరిపిలేని వర్షాల కారణంగా ఫ్లై ఓవర్ సర్వీసు రోడ్డులో గోతులు పడి వర్షం నీరు నిలిచిపోవడంతో వాహనదారులు, ప్రయాణీలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉండ్రాజవరం జంక్షన్‌కు నాలుగు వైపులా సర్వీసు రోడ్డు పెద్ద గోతులతో చెరువులు మాదిరిగా మారిపోయాయి.

వర్షాలకు పల్లపు ప్రాంతాలు మునక

అత్తిలి: ఎడ తెరపిలేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలో పలు పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. మురుగునీటి డ్రెయిన్‌లు పొంగి రహదారులపై ప్రవహించడంతో ప్రజలు ఇక్కట్లు పడ్డారు. రోడ్లపైకి సిల్టు చేరడంతో అపరిశుభ్రత వాతావరణం నెలకొంది. అత్తిలి సంతాన గోపాలస్వామివారి ఆలయ ప్రాంతంలో వర్షం నీరు బయటకు వెళ్లే డ్రెయిన్ సదుపాయం లేకపోవడంతో రోడ్డు వెంబడి నీరు నిలిచిపోయింది. అత్తిలి బస్‌స్టేషన్ సెంటర్ నుంచి పాలూరు డ్యాం వరకు గల ఆర్అండ్‌బీ రహదారి వెంబడి వర్షం నీరు నిలిచిపోవడంతో ద్విచక్రవాహనదారులు, స్థానిక ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. నీటిలో వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో రోడ్డుపై ఉన్న మురగునీరు ఇళ్లగోడలపైకి చిమ్ముతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు డ్రెయిన్ నిర్మించి మురుగునీరు బయటకు వెళ్లే ఏర్పాటు చేయాలని స్థానికుడు దిరిశాల మునేశ్వరరావు కోరారు.



తణుకు టౌన్: ఉండ్రాజవరం జంక్షన్‌లో రోడ్డుపై నిలిచిపోయిన వర్షపు నీరు



తణుకు : అధ్వానంగా మారిన తణుకు రైల్వేస్టేషన్ రోడ్డు



తణుకు: వెంకటేశ్వర థియేటర్ సెంటర్‌లో నిలిచిన వర్షపునీరు



తణుకు టౌన్: తణుకు నుంచి తాడేపల్లిగూడెం వైపు వెళ్లే రోడ్డు దుస్థితి



అత్తిలి: సంతాన వేణుగోపాల స్వామి ఆలయం వద్ద రోడ్డుపై నిలిచిన వర్షం నీరు

దూరమైనా.. ఉచిత బస్‌పాస్‌తో

- విద్యార్థులను సురక్షితంగా పాఠశాలకు చేరుస్తున్న ఆర్టీసీ
- ఉచిత బస్‌పాస్‌లకు భాగస్వాములుగా దాతలు
- నచ్చిన పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులు
- ప్రతి ఏడాదీ వేలల్లో ఉచిత బస్ పాస్‌లు



తణుకు ఆర్టీసీ బస్టాండ్‌లో వేచి ఉన్న బస్సు



తణుకు శ్రీ సూర్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత బస్‌పాస్‌లు అందజేస్తున్న దాతలు (ఫైల్)

తణుకు అర్బన్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల విద్యాభ్యాసానికి ఆర్టీసీ రథచక్రాలు అండగా నిలుస్తున్నాయి. దూరప్రాంతాల నుంచి పాఠశాలలకు వచ్చే విద్యార్థుల సౌకర్యార్థం ఉచిత బస్‌పాస్‌లు అందజేసి వారిని సురక్షితంగా పాఠశాలలకు చేరుస్తున్నాయి. దీంతో పేద విద్యార్థులు తమకు అందివచ్చిన ఉచిత బస్ పాస్ సౌకర్యాన్ని సద్వినియోగపరచుకుని మంచి విద్యను అభ్యసిస్తున్నారు. 12 సంవత్సరాల్లోపు వయసున్న 6, 7 తరగతుల బాలురు, 18 సంవత్సరాల వయస్సులోపు 6 నుంచి 10వ తరగతి బాలికలు ఈ ఉచిత బస్ పాస్ సదుపాయానికి అర్హులుగా ఆర్టీసీ నిర్ధేశించింది. విద్యార్థులు తమ ఇంటి నుంచి పాఠశాలలకు ప్రయాణించే నేపథ్యంలో 50 కిలోమీటర్ల పరిధిని కేటాయించి ఈ సౌకర్యాన్ని విద్యార్థులకు సమకూర్చింది. ఉచిత బస్ పాస్ సౌకర్యం ఆర్టీసీ అందిస్తుండడంతో విద్యార్థులు దూరమైనా తమకు నచ్చిన పాఠశాలలో చదువుకునే వెసులుబాటు కలిగింది. ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన సౌకర్యాలతో గత ఐదేళ్ల కాలంలో ఈ ఉచిత బస్ పాస్‌ల సంఖ్య మరింత పెరిగింది.

దాతల సౌజన్యంతో..

ఈ ఉచిత బస్ పాస్‌లు అందజేయడంలో దాతల పాత్ర కూడా కీలకంగా ఉంది. విద్యార్థులకు గుర్తింపు కార్డు ఇచ్చే క్రమంలో అయ్యే ఖర్చు రూ. 50లను ఆర్టీసీ ఉద్యోగులు దాతలను సమకూర్చి బస్సు పాస్‌లు అందజేస్తున్నారు. ఒక పాఠశాలలో ఎంతమంది విద్యార్థులకు బస్ పాస్‌లు అవసరమో తెలుసుకుని వారి పూర్తి వివరాలను పాఠశాల నుంచి సేకరించి తదుపరి దాతలను సమకూర్చుకుని విద్యార్థికి రూ. 50లు ఐడీకి, లామినేషన్ చేయాలంటే మరొక రూ. 10లు చొప్పున దాతలు అందజేస్తూ వారు కూడా ఉచిత బస్ పాస్‌ల పంపిణీలో భాగస్వామ్యులు అవుతున్నారు. తణుకు పట్టణానికి సంబంధించి మానవత స్వచ్ఛంద సేవా సంస్థ, రోటరీ క్లబ్, స్వర్ణ లయన్స్ క్లబ్, శ్రీ సూర్య ఫౌండేషన్, నరేష్ క్లాత్ షోరూం యాజమాన్యాల సౌజన్యంతో గత కొన్నేళ్లుగా విద్యార్థులకు ఉచిత బస్ పాస్‌లు అందజేస్తున్నారు. ప్రతి ఏడాది సుమారుగా 1500 నుంచి 3వేల వరకు బస్‌పాస్‌లు విద్యార్థులకు అందిస్తున్నారు.

ఉచిత బస్‌పాస్‌లకు దాతల తోడ్పాటు భేష్



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభ్యాసం చేసే విద్యార్థులకు ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో బస్‌పాస్ ద్వారా ఉచిత ప్రయాణ సౌకర్యం గతం నుంచి అందుబాటులో ఉంది. ఇటీవల కాలంలో ఆర్టీసీ ఉద్యోగులు ఈ ఉచిత బస్ పాస్‌లపై ప్రత్యేక దృష్టి సారించి అధికశాతం పాస్‌లు పంపిణీ చేసేందుకు కృషి చేస్తున్నారు. పాస్‌ల పంపిణీలో విద్యార్థులకు ఐడీ కార్డు ఇచ్చేందుకు దాతలను సమీకరించి ఒక్కొక్క విద్యార్థికి ఐడీకి రూ. 50లు, లామినేషన్‌కు రూ. 10 చొప్పున దాతల నుంచి సేకరించి విద్యార్థులకు ఉచితంగా అందజేస్తున్నాం.

– సప్పా గిరిధర్‌కుమార్, తణుకు ఆర్టీసీ డిపో మేనేజరు

ఉచిత బస్‌పాస్ సౌకర్యంతో మేలు



తణుకు జెడ్పీ బాలుర హైస్కూలులో నేను 10వ తరగతి చదువుతున్నాను. నా నివాసమైన పెరవలి మండలం నల్లాకులవారిపాలెం నుంచి ప్రతిరోజూ పాఠశాలకు ఆర్టీసీ బస్సులో ఉచిత బస్ పాస్ ద్వారా వస్తున్నాను. ఈ పాఠశాలలో విద్యాభ్యాసం బాగుంటుందనే ఉద్దేశ్యంతో దూరమైనా ఉచిత బస్ పాస్ సౌకర్యాం ఉండడంతో రాగలుగుతున్నాను.

– మోకదోగ సాయికృష్ణ, తణుకు జెడ్పీ బాలుర హైస్కూల్ విద్యార్థి.

ఆర్టీసీ బస్సులో పాఠశాలకు వస్తున్నాను



తణుకు జెడ్పీ బాలుర హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్నాను. పెరవలి రోడ్డులోని ఎస్‌కేఎస్‌డీ ఉమెన్స్ కళాశాల ప్రాంతం నుంచి ప్రతిరోజూ పాఠశాలకు ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తూ వస్తున్నాను. మా ఉపాధ్యాయులు ఆర్టీసీ నుంచి మానవత సంస్థ ద్వారా నాకు ఉచిత బస్ పాస్ ఇచ్చారు.

– రుంకు గీత, తణుకు జెడ్పీ బాలుర హైస్కూల్ విద్యార్థిని.

చెరువులను తలపిస్తున్న రహదారులు



ఎల్.అగ్రహారం టిడ్కో గృహ సముదాయం వద్ద రహదారిపై ఏర్పడిన గోతుల్లో చేరిన వర్షపు నీరు



ఇటుకులగుంట టర్నింగ్ వద్ద రహదారి దుస్థితి

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం మండలంలోని పలు రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు రహదారులపై ఏర్పడిన గోతుల్లోకి నీరు చేరి చెరువుల మాదిరిగా దర్శనమిస్తున్నాయి. ప్రధానంగా తాడేపల్లిగూడెం – ఎల్.అగ్రహారం, అప్పారావుపేట – మాధవరం, దండగర్ర – మాధవరం రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. పగటి మాట ఎలా ఉన్నా రాత్రి సమయాల్లో రోడ్లపై గోతులు కనిపించక వర్షపు నీటితో వాహనాలు దిగబడిపోతున్నాయని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఈ రహదారులపై ఏర్పడిన గోతులను పూడ్చించాలని ప్రజలు కోరుతున్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి



ఉద్యానవర్సిటీలో మొక్కలు నాటుతున్న వీసీ కె.గోపాల్ తదితరులు

తాడేపల్లిగూడెం: మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డా.కె.గోపాల్ తెలిపారు. భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి ఆదేశాల మేరకు శనివారం డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపకులపతి డాక్టర్ కె.గోపాల్ మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడటానికి , భూతాపాన్ని తగ్గించి, వాతావరణ మార్పులను సమర్థవంతంగా నియంత్రించడానికి ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. వర్సిటీ పరిపాలనా భవనం వద్ద ఈస్టుకోస్టుటాల్ రకం కొబ్బరి మొక్కను వీసీ నాటారు. కృషి విజ్ఞాన కేంద్ర ఆవరణలో మునగ, కరోండా మొక్కలను నాటారు. మొక్కలను పెంచడం వల్ల నేత కోతను అరికట్టవచ్చని, మొక్కలు హానికరమైన బొగ్గుపులుసు వాయువును పీల్చుకొని ఆక్సిజన్ విడుదల చేయడం వల్ల పర్యావరణ సమతుల్యం కాపాడతాయని వర్సిటీ విస్తరణ సంచాలకులు ఇ.కరుణశ్రీ అన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు, డీన్ ఆఫ్ హార్టీకల్చర్ ఎల్.నారం నాయుడు, సీఈఓ డివి.స్వామి, డీఎస్ఏ సలోమిసు నీత, జాయింట్ రిజిస్ట్రార్ ఆనంద్‌బాబు, కెవికె శాస్త్ర వేత్తలు వి.దీప్తి, ఏ.దేవీవరప్రసాదరెడ్డి, రాఘవేంద్ర రెడ్డి, కె.వెంకటసతీష్‌లు పాల్గొన్నారు.

ఆర్థిక భద్రత సేవలో జీవిత బీమా



గరికిపాటి బాపయ్య శర్మ

తాడేపల్లిగూడెం (టీటీసీ): దేశ ప్రజలకు ఆర్థిక భద్రత, ప్రభుత్వాలకు లక్షల కోట్ల రూపాయిలు చేయూతనిస్తూ ప్రభుత్వరంగ అగ్రగామి ఆర్థిక సంస్థగా జీవిత బీమా (ఎల్ఐసీ) అభివృద్ధి చెందిందని ఎల్ఐసీ విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు గరికిపాటి బాపయ్య శర్మ వెల్లడించారు. సెప్టెంబర్ 1వ తేదీ నాటికి ఎల్ఐసీ 68 సంవత్సరాలు పూర్తి చేసుకుని జాతి జనుల సేవలో అగ్రభాగన నిలిచిందన్నారు. 1956లో 5 కోట్ల రూపాయిలు పెట్టబడితో ప్రారంభించి ఈ సంస్థ, నేడు 52 లక్షల కోట్లు రూపాయిల పెట్టబడితో ప్రపంచ స్థాయి బీమా సంస్థగాను, 40 కోట్లు పట్టాదారులకు కొంగు బంగారంగా సేవలు అందిస్తోందని తెలిపారు. బీమా ప్రీమియం విషయంలో జీఎస్టీని తొలగించాలని, ఎల్ఐసీని మరింత పటిష్టంగా అభివృద్ధి చేసి కాలానుగుణంగా ఉద్యోగుల భర్తీ, మౌలిక సదుపాయాలు కల్పించాలని, ప్రభుత్వం ఎల్ఐసీని మరింతగా ప్రోత్సహించాలని కోరారు. ప్రజల నమ్మకాన్ని చూరగొన్న ఎల్ఐసీ మరింతగా సేవలు అభివృద్ధి చేస్తుందని ఆకాంక్షించారు.

ప్రజలపై భారాలు మోపడం సరికాదు



సమావేశంలో మాట్లాడుతున్న మంతెన సీతారాం

తాడేపల్లిగూడెం (టీటీసీ): దేశంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ దేశ సంపదను కార్పొరేట్లకు దోచి పెట్టి ప్రజలపై భారాలు మోపడం సరికాదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మంతెన సీతారాం ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో జరుగుతున్న పార్టీ జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో రెండో రోజు సీతారాం పాల్గొన్నారు. ఈ సమావేశానికి జిల్లా కార్యదర్శి జె.ఎన్.వి.గోపాలన్ అధ్యక్షత వహించారు. మంతెన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం తన నియంతృత్వం కొనసాగిస్తుందని విమర్శించారు. మోదీ అధికారంలో ఉన్నంత వరకు అంబానీ, ఆదానీలే అభివృద్ధి చెందుతారని చెప్పారు. దేశ సంపదను కొల్లగొట్టి అంబానీ, ఆదానీలకు దోచిపెట్టి, సామాన్య ప్రజలపై భారాలు వేస్తున్నారని మండిపడ్డారు. దేశంలో నిత్యావసర వస్తువులు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెరగడం ఆందోళనకరమన్నారు. మూడోవసారి అధికారంలోకి వచ్చినా ఒక్కసారి కూడా ప్రజలపై భారాలను తగ్గించే ప్రయత్నం చేయకపోవడం శోచనీయమన్నారు. రైతు బజార్లలో నాణ్యత పెంచాలన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్రం తీసుకువచ్చే ప్రజా వ్యతిరేక చట్టాలను రాష్ట్రంలోనీ కూటమి ప్రభుత్వం అమలు చేయాలని చూడటం మానుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బి.బలరాం, సీపీఎం నాయకులు కర్రి నాగేశ్వరరావు, చింతకాయల బాబూరావు, కేతా గోపాలన్, పీవీ ప్రతాప్, బి.వాసుదేవరావు, కౌరు పెద్దిరాజు, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పింఛన్ల పంపిణీ

ఇరగవరం: మండలంలో 21గ్రామాల్లో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం శనివారం ప్రశాంతం సాగింది.కావలిపురం గ్రామంలో ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. శుక్రవారం అర్ధరాత్రి నుంచి వర్షం పడడం వల్ల సిగ్నల్స్ సరిగ్గా పని చేయకపోవడంతో సచివాలయ ఉద్యోగులు పింఛన్ల పంపిణీకు ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా ప్రభుత్వ ఆదేశాలను మేరకు సిబ్బంది వర్షంలోనే తడుస్తూ పింఛన్ల పంపిణీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. మండల వ్యాప్తంగా 9472 మందికి పింఛన్లు అందజేయాల్సి ఉండగా శనివారం 95శాతం పూర్తిచేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షాలకు పొంగుతున్న ఎర్ర కాలువ



మాధవరం -కంసాలిపాలెం కాజ్ వే వద్ద తాత్కాలిక వంతెన పై నుంచి ప్రవహిస్తున్న వరద నీరు

తాడేపల్లిగూడెం రూరల్: ఎర్ర కాలువకు మరలా వరద నీరు చేరుతోంది. ఎగువ ఏజెన్సీ, వాగులు, వంకలు, డ్రెయినేజీల నుంచి వర్షపు నీరు ఎర్ర కాలువకు వస్తోంది. దీంతో తాడేపల్లిగూడెం మండలం మాధవరం – కంసాలి పాలెం కాజ్ వే వద్ద తాత్కాలిక వంతెన పై నుంచి వరద నీరు ప్రవహిస్తోంది. కాగా, వరద నీటిని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఈతకోట తాతాజీ, నాయకులు కొండపల్లి నగేష్, బండి శ్రీనివాస్ తదితరులు పరిశీలించారు.